
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 48 వ భాగం

### గంగావతరణం – 4

యాగాశ్వం కోసం వెతుకుతూ సగరులు పాతాళానికి తవ్వుకుంటూ పోతే అక్కడ కపిలుడు కనిపించాడనీ ఆయన మీద దాడి చేయబోయేసరికి భస్మమైపోయారనీ చదువుకున్నాం. అలా పోయిన సగరులకి ఉత్తమగతుల కోసం దివినుండి గంగని తీసుకురావడానికి సగరుని మనుమడు అంశుమంతుడూ, ఆయన కొడుకు దిలీపుడూ కూడా ప్రయత్నం చేస్తూ కాల పరవశులయ్యేరు. ఆ తరువాత తరం ఆయన భగీరథుడు కష్టపడి మొత్తానికి గంగని భువిమీదకి దింపడాన్ని సాధించాడు. గంగ దిగడానికి ఒప్పుకున్నాక ఆవిడని ధరించడానికి మహేశ్వరుడు కూడా ఒప్పుకున్నాడు. ఇప్పుడు గంగా ప్రవాహం ఎలా కిందికి దిగిందో పోతన వర్ణన చూద్దాం. ఎప్పటిలాగానే ఈ వచనం నోరు తడబడకుండా చదవడానికి ప్రయత్నం చేయండి.

వ. ఇట్లమ్మహానదీప్రవాహంబు, పురారాతిజటాజూటరంధ్రంబుల వలన వెలువడి, నిరర్గళాయమానంబై, నేలకుఁ జల్లించి, నెఱసి నిండి పెల్లు వెల్లిగొని, పెచ్చు పెరిగి విచ్చలవిడిం గ్రేపువెంబడి **నుఱక క్రేళ్ళుఱుకు మఱక ప్రాయంపుఁ గామధేనువు చందంబున** ముందఱికి నిగుడు ముద్దుఁ జందురు తోడి నెయ్యంబునఁ గ్రయ్య నడరి చొప్పుదప్పక సాఁగి చనుదెంచు సుధార్ణవంబు కైవడిఁ బెంపుఁ గలిగి **మహేశ్వరు వదనగహ్వరంబు వలన నోంకారంబు పిఱుంద వెలువడు శబ్దబ్రహ్మంబు** భంగి నదభ్రవిభ్రమంబై యమ్మహీపాల తిలకంబు తెరువు వెంటనంటి వచ్చు వెలియేనుఁగు తొండంబుల ననుకరించి పఱచు వఱదమొగంబులును, వఱదమొగంబుల పిఱుందనందంద క్రందుకొని పొడచూపి తొలంగు బాలశారదా కుచకుంభంబులకు నగ్గలం బైన బుగ్గలును, బుగ్గలసంగడంబునం బారిజాతకుసుమ స్తబకంబుల చెలువంబులం దెగడు వెలినురువులును, వెలినురువుల చెంగట నర్ధోన్మీలిత కర్పూరతరుకిసలయంబులఁ చక్కందనముఁ గేలిగొను సుళ్ళును, సుళ్ళ కెలంకుల ధవళజలధరరేఖాకారంబుల బాగు మెచ్చని నిడుద యేఱులును, నేఱులం గలసి వాయువశంబున నొండొంటిం దాఁకి బిట్టు మిట్టించి, మీఁది కెగయు దురితభంగంబులైన భంగంబులును, భంగంబులకొనల ఛిన్నభిన్నంబులై కుప్పించి, యుప్పరం బెగసి, ముత్తియంపు సరుల వడుపున, మల్లికాదామంబుల తెఱంగునఁ గర్పూరఖండకదంబంబుల చెలువంబున నిందుశకలంబుల తేజంబునఁ, దారకానికరంబుల పొలుపున మెఱయుచు, **ముక్తి కన్యా వశీకరంబులైన శీకరంబులునుం** గలిగి, మధ్యమలోక శ్రీకరంబై, శ్రీకరంబు తెఱంగున విష్ణుపదంబు ముట్టి, విష్ణుపదంబు భాతి నుల్లసితహంసరుచిరంబై, రుచిరపక్షంబురీతి నతిశోభితకువలయంబై, కువలయంబు చెన్నున బహుజీవనంబై, జీవనంబులాగున సుమనోవికాసప్రధానంబై, ప్రధాన పర్వంబు పోలుపున నేకచక్ర బక భీమ మహాభంగ సుభద్రార్జున చరిత్రారామంబై, రామచిత్తంబు మెలఁపువం దనవారిలోఁజొచ్చిన దోషాచరుల కభయప్రదాన చణంబై, ప్రదానచణ వర్తనంబు భాతి సముపాసిత మృత్యుంజయంబై, మృత్యుంజయురూపంబుపోలిక విభూతి సుకుమారంబై, కుమారచరిత్రంబులేవను గ్రౌంచప్రముఖవిజయంబై, విజయ రథంబుభాతి హరిహయామంథరంబై, మంథరవిచారంబు గ్రద్దన మహారామగిరివనప్రవేశకామంబై, కామకేతనంబు పెల్లున నుద్దీపిత మకరంబై మకరకేతను బాణంబు కైవడి విలీనపరవాహినీకలిత శంబరంబై, శంబరారాతి చిగురు గొంతంబుసూటి నధ్వగవేదనాశమనంబై, శమనదండంబు జాడ నిమ్నోన్నత సమవృత్తంబై, వృత్తశాస్త్రంబు విధంబున వడిగలిగి సదా గురులఘువాక్యచ్ఛటా పరిగణితంబై, గణితశాస్త్రంబు కొలఁదిని ఘనఘనమూల వర్గమూల సంకలిత భిన్నమిశ్ర

ప్రకీర్ణఖాతభీష్మంబై, భీష్మపర్వంబు పెంపున ననేక భగవద్గీతంబై, గీతశాస్త్రంబు నిలుకడను మహాసుషిరతను ఘన నానాశబ్దంబై, శబ్దశాస్త్రంబు మర్యాద నచ్చువడి హల్లు గలిగి, మహాభాష్యరూపావతారవృత్తి వృద్ధిగుణసమర్థంబై, యర్థశాస్త్రంబు మహిమను బహుప్రయోజన ప్రమాణ దృష్టాంతంబై, దృష్టాంతంబు తెఱంగున సర్వసామాన్య గుణవిశేషంబై, శేషవ్యాపారంబు కరణిని సుస్థిరోద్ధరణతత్పరంబై, పరబ్రహ్మంబుగరిమ నతిక్రాంతానేక నిగమంబై, నిగమంబు నడవడిని బ్రహ్మవర్ణపదక్రమసంగ్రహంబై, గ్రహశాస్త్రంబు పరిపాటిని గర్కట మీన మిథున మకరరాశి సుందరంబై, సుందరి ముఖంబు పోఁడిమిని నిర్మల చంద్రకాంతంబై, కాంతాధరంబు రుచిని శోణచ్ఛాయావిలాసంబై, విలాసవతి కొప్పునొప్పునఁ గృష్ణనాగాధికంబై, యధికమతిశాస్త్రసంవాదంబు సొంపున నపార సరస్వతీ విజయ విభ్రమంబై, విభ్రమవతిచనుదోయి పగిది నిరంతర పయో వ్యాప్తాఖిలలోక జీవనప్రద తుంగభద్రాతిరేఖా సలలితంబై, లలితవతి నగవు మించున నపహసిత చంద్రభాగధేయంబై, భాగధేయవంతుని వివాహంబు లీల మహామేఖలకన్యకావిస్తారంబై, తారకెంగేలి యొడికంబున నాక్రాంత సూర్యతనయంబై, సూర్యతనయు శరవర్షంబు పోలిక భీమరథ్యాటోపవారణంబై, వారణంబు పరుసునం బుష్కరోన్నత సంరంభంబై, రంభ నెమ్మోము డాలున సురసాతిశయ దశం బై, దశరథ తనయు బొమముడి చాడ్పున సింధుగర్వ ప్రభంజనం బై, ప్రభంజతనయు గదపెట్టు మాడ్కిని సమీపగత దుశ్శాసన దుర్మద నివారకరంబై, వారకన్యక ముంజేతి గతిని ముహుర్ముహురుచ్చలిత కంకణాలంకృతంబై, కృతయుగంబు నోజ నపంకంబై, పంకజాసనుముఖంబు నొఱపునఁ బ్రభూతముఖ్యవర్ణంబై, వర్ణగుణితంబు తెఱకువను బహుదీర్ఘబిందు విసర్గంబై, సర్గబంధకావ్యంబు విన్ననువున గంభీరభావమధురంబై, మధురాపురంబు సొబగున మహానందనందనంబై, నందనవనంబు పొందున విహరమాణ కౌశికంబై, కౌశికహయంబు రీతి సుదశధ్రువంబై, ధ్రువు తలంపు క్రియం గ్రియాబరిశీలిత విశ్వంభరంబై, విశ్వంభరుని శంఖంబు రూపున దక్షిణావర్తోత్తరంబై, యుత్తరావివాహంబు చందంబునఁ బ్రముదిత నరంబై, నరసింహు నఖరంబుల భాతి నాశ్రిత ప్రహ్లాద గురువిభవ ప్రదానంబై, దానకాండంబు సిరిం గామధేను కల్పలతాద్యభివనంబై, నవసూతికాకుచంబు పేర్మిని నిరంతర పయోవర్ధనంబై, ధనదు నిలయంబు తూనికను సంభృత మకర పద్మ మహాపద్మ కచ్ఛపంబై, కచ్ఛప కర్పరంబు బలిమిని బతితశైలసముద్ధరణంబై, ధరణీధరంబు సాటి నుత్తుంగ తటముఖ్యంబై, ముఖ్యవరాహంబు గరిమ నున్నత క్షమంబై, క్షమాసుర హస్తంబు గరగరికను సత్పవిత్ర మనోరామం బై, రామచంద్రుని బాణంబుకడింది నభాగ్యత ఖరదూషణ మదాపహరణ ముఖరంబై, ముఖర రామ కుఠారంబు రీతిని భూభృన్మూలచ్ఛే దన ప్రబలంబై, బలరామహలంబుభాతిని బ్రతికూలసన్నికర్షణ ప్రబుద్ధంబై, బుద్ధదేవునిమేని యొఱపున నభియాతి రక్షోదార మనోహరం బై, హరతాండవంబు మేర నుల్లసితానిమిషంబై, యనిమిషావతారంబు కీర్తిని శ్రుతి మంగళప్రదంబై, **ప్రదాత యోగి సూటినర్థ పరంపరా వామనంబై, వామనచరణరేఖను బలివంశవ్యపనయంబై**, నయశాస్త్రంబు మార్గంబున సామభేదమాయోపాయ చతురంబై, చతురాన నాండంబు భావంబున నపరిమిత భువన జంతుజాల సేవ్యమానం బై, మానినియన లోఁతు చూపక, గరితయన చడిచప్పుడు చేయక, ముగుద యన బయలు పడక, ప్రమద యన గ్రయ్యంబాఱుచుఁ, బతివ్రత యన నిట్టట్టుఁ జనక, తల్లియన నెవ్వియైన లోఁగొనుచు, దైవంబన భక్త మనోరథంబు లిచ్చుచు, నంతకంతకు విస్తరించి గుఱిగడచి, **యవాఙ్మానస గోచరంబై ప్రవహించి**. [9-230]

గమనించండి, ఇదంతా ఒకే ఒక వ్యాక్యం. కొన్ని చోట్ల కింద గీత పెట్టి ఉంచాను భాష మీద పట్టు అర్ధం చేసుకోవడానికి. ఈ మొత్తం గంగా ప్రవాహం అంతా చదివితే తెలిసేది ఏమిటంటే, ఒక ముక్క చివరి పదం రెండో ముక్క మొదటి పదానికి అనుసంధానించి ఉంటుందనేది – ఉదాహరణకి – క్షమాసుర హస్తంబు గరగరికను సత్పవిత్ర **మనోరామం బై**, **రామచంద్రుని** బాణంబుకడింది నభాగ్యత ఖరదూషణ మదాపహరణ **ముఖరంబై**, **ముఖర రామ** కుఠారంబు రీతిని భూభృన్మూలచ్ఛే దన **ప్రబలంబై, బలరామహలంబుభాతిని** బ్రతికూలసన్నికర్షణ **ప్రబుద్ధంబై, బుద్ధదేవునిమేని** యొఱపున నభియాతి రక్షోదార **మనోహరం బై, హరతాండవంబు** మేర **నుల్లసితానిమిషంబై, యనిమిషావతారంబు** కీర్తిని శ్రుతి **మంగళప్రదంబై, ప్రదాత** యోగి సూటినర్థ పరంపరా **వామనంబై, వామనచరణరేఖను** బలివంశవ్యపనయంబై….

పాలుతాగిన దూడ గెంతులు వేస్తున్నట్టూ గంగ దివి నుండి కిందకి దిగి ప్రవహిస్తూంటే ఆ ప్రవాహం ఎలా ఉంది అంటే, మహేశ్వరుడు సమాధిలో ఉన్నప్పుడు ఆయనలోంచి వచ్చే గంభీరమైన ఓంకారంలాగా, క్షమాసురుడి (క్షమ – భూమి, సురుడు – దేవత; భూమికి దేవత అయినటువంటి బ్రాహ్మణుడు) ఇంపు (మనోభిరామంబు) అయిన హస్తం లాగా, ఖర ధూషణ ల మీద రామచంద్రుడు వదిలిన బాణంలాగా, పరశురాముని (మఖరరామ)

గొడ్డలి (కుఠారంబు) లాగా, బలరాముడి చేతిలోని శత్రువులని నిర్మూలించే హలాయుధం లాగా. అలా ప్రవహించే గంగానది ప్రదాత ఇగినూటి అర్థ పరంపరా వామనంబైపోయిందిట. అంటే ఇచ్చేవాడు ఏది మిగిలిందో లేదో చూసుకోకుండా ఇచ్చేస్తూ ఉంటే ఏమౌతుంది? ఉన్న డబ్బులు (అర్థం) వామనం (అంటే కుచించుకుపోవడం) అయిపోతుందని హాస్యం. ఇంకా ఆ తర్వాత ఆ మందాకిని ఎక్కడికి వెళ్తుందో కూడా చెప్తున్నాడు – వామన చరణరేఖను బలివంశ వ్యపనయంబై. దానం ఇచ్చేసాక బలి వంశం ఎక్కడికి వెళ్ళింది శ్రీహరి పాదం తలమీద ఉంచాక? అధోలోకాలకి కదా? అలా ప్రవహిస్తూ దివినుంచి కిందకి దిగి పాతాళంలోకి ప్రహహించింది.

ఎలా ప్రవహించిందనేది చివరిలో మరోసారి చెప్తున్నాడు – తల్లియన నెవ్వియైన లోఁగొనుచు, దైవంబన భక్త మనోరథంబు లిచ్చుచు, నంతకంతకు విస్తరించి గుఱిగడచి, **యవాఙ్మనస గోచరంబై ప్రవహించి**. తల్లిలాగా కష్టాలూ, పాపాలూ అన్నీ తన లోపల దాచుకుంటూ, అందరి కోరికలూ తీరుస్తూ లక్ష్యాలు దాటుకుంటూ యవాఙ్మనస గోచరంబై ప్రవహించి (మాటకీ మనసుకీ అందకుండా). మరోసారి ఈ వచనం చదివితే ఏమనిపిస్తుంది? ఇది పద్యమా, కవిత్వమా వచనమా? అసలు ఇది తెలుగేనా? అనిపించడం సర్వసాధారణం. అందుకే ఉషశ్రీ వంటివారు దీనిని పోతన "కవిత్వ వచనం" అంటూ ఉండడం కద్దు. నృసింహావతారంలో వచనంలాగానే ఈ వచనం మీద ఒక పరిశోధన సులభంగా చేయవచ్చు ఓపిక ఉంటే.

మ. జగతీనాథు రథంబుపజ్జ బహుదేశంబుల్ వడిన్ దాఁటి త
త్సగరక్ష్మాపకుమార భస్మముల మీఁదన్ ముంచి పాఱన్ మరు
న్నగరావాసము వారు పొందిరి నవీనశ్రీలతో గంగ నీ
రుగతిం గాక మహాదురంత సుజనద్రోహానలం బాఱునే. [9-231]

ఇప్పుడా గంగ భగీరథుడు రథంమీద ముందుకి వెళ్తూ దారి చూపిస్తూంటే అతని వెంట అనేకానేక దేశాలు దాటి సగరుల భస్మ రాసులమీదనుంచి ప్రహహించింది. అలా వాళ్లకి ఉత్తమగతులు లభించాయి. మరి అలాంటి వాళ్ళు చేసిన మహా పాపాలకి ప్రాయశ్చిత్తం గంగా జలంతో తప్ప పోదు కదా?

మ. హరు మెప్పించి మహా తపో నియతుఁడై యాకాశగంగానదిన్
ధరకుం దెచ్చి నితాంత కీర్తిలతికా స్తంభంబుగా నవ్య సు
స్థిర లీలం బితృకృత్య మంతయు నొనర్చెన్ వారితానేక దు
స్తర వంశవ్యథుఁ డా భగీరథుఁడు నిత్యశ్రీకరుం డల్పుఁడే? [9-232]

మరి ఇంతటి కష్టం పడి, మహాన్వితమైన తపస్సుతో మహేశ్వరుణ్ణీ, గంగానదినీ ప్రసన్నం చేసుకుని ఎప్పుడో పోయిన తన పూర్వీకుల గురించి అంత తాపత్రయంతో దివినుంచి భువికి గంగని దింపి శాశ్వతమైన మంగళకరుడైన (నిత్య శ్రీకరందు) భగీరధుడి పోలి వచ్చేది మరొకరెవరున్నారు? అంతటి కష్టపడే వాళ్ళని అపర భగీరధుడు అనడం, అటువంటి కష్టమైన ప్రయత్నాన్ని "భగీరథ ప్రయత్నం" అనడం వింటూ ఉంటాం.

క. హరిఁ దమ మనముల లోనిడి
హరి పాదాంభోజ జనితమైన నదిన్ సు
స్థిరులై క్రుంకి మునీంద్రులు
హరిఁ గలిసిరి త్రిగుణరహితులై యవ్వేళన్ [9-233]

మరి ఇటువంటి నదిలో తర్వాత ఏమైంది? శ్రీహరిని మనసులో నింపుకున్న మునీంద్రులు హరి పాదాల దగ్గిర పుట్టిన గంగలో స్నానాలు చేసి త్రిగుణాతీతులై, పవిత్రులై శ్రీహరిలో లీనమయ్యేరు.

ఈ గంగావతణం వ్యాస పరంపర ముగించేముందు కొన్ని విషయాలు చూద్దాం. అసలీ గంగావతరణం దివినుండి వచ్చిందా, లేకపోతే గంగోత్రి అనేచోట చిన్న ధారలా మొదలై అనేకానేక ఉపనదులూ, కాలువలూ తనలో కలుపుకుంటూ అలా మహా ప్రవాహంలా తయారైందా అనేవి. భారత దేశాన్ని విదేశీయులు పాలించేటపుడు (కొంతవరకూ ఇప్పుడూను) ఈ గంగావతరణం కథ విని ఇదంతా ఉత్తి పుక్కిట పురాణం అనీ, గంగోత్రి దాకా వెళ్ళి "ఇదిగో ఇక్కడే మీ గంగ పుట్టింది చూసుకోండి కావాలిస్తే, మేము ఖగోళ శాస్త్రం, భూగోళ శాస్త్రం ఉపయోగించి చూసాం, పటం లో ఇలా ఉంది, ఆ తర్వాత మిగతా కాలవల్లో మురుగు నీళ్ళూ అవీ కలిసి హరిద్వార్ నుంచి వారణాసి వచ్చేసరికి అదే మీ 'ప-వి-త్ర-మై-న' గంగా ప్రవాహం అని గేలి చేసారు." అదే విధంగా ఆ అభిప్రాయాన్నే మన మీద రుద్దితే, నిజమే కాబోలని మనం కూడా వాళ్ళు చూపించిన దృష్టాంతాలన్నీ నమ్మి గంగోత్రి దగ్గిరే గంగ పుట్టిందని నమ్ముతున్నాం.

ఓ సారి వెనక్కి చూస్తే 2013 లో ఉత్తర భారతంలో వరదలొచ్చాయి. ఆ వరదల సంగతి ఇక్కడ చూడవచ్చు. (https://en.wikipedia.org/wiki/2013_North_India_floods). ఈ వరదలు ఎలా ఎందుకు వచ్చాయో మనకి మొదట్లో "మీ గంగావతరణం పుక్కిటపురాణం" అని చెప్పిన విదేశీయులే మరోసారి విశదీకరించి, ఇప్పుడు మరో పేరు పెట్టి మరీ చెప్తున్నారు – (https://en.wikipedia.org/wiki/Cloudburst) అనేకానేక మేఘాలు ఒకచోట చేరి ఒక్కసారి కుంభవృష్టి కురిసిందిట. ఎటువంటి కుంభవృష్టి? మామూలు వర్షపాతం కంటే 375 రెట్లు ఎక్కువ వర్షం కురిసింది. ఈ కుంభవృష్టి ఎక్కడా? కేదార్ నాథ్ గుడి దగ్గిర. మరి గంగానది కిందకి దిగినప్పుడు ఎక్కడ దిగింది? మహేశ్వరుడి జటాజూటంలోనేనా? ఇలా కురిసిన కుంభవృష్టి వల్ల ఎంతో నష్టం జరిగింది కదా అయినా కేదార్ నాథ్ గుడి చెక్కు చెదరలేదు. అంటే ఇదే గంగావతరణం అని చెప్పడంకానీ, ఇవన్నీ మన వేదాల్లో ఉన్నాయిట అని చెప్పడం కానీ నా ఉద్దేశ్యం కాదు కానీ ఓ సారి ఆలోచిస్తే గంగావరణం అనేది ఇటువంటి పరిస్థితులలో ఎందుకు జరిగి ఉండకూడదు? వీటిని మొదట్లో మనకి లేని, ఇప్పుడు ఉన్న మాధ్యమాల వల్ల తెలుసుకో గలుగుతున్నాం. "అబ్బే ఇదంతా నిజంకాదు; ఒకరి ఊహ మాత్రమే" అనే వారికో ప్రశ్న. మరి ముందు ముందు కొత్తగా కనిపెట్టే పనిముట్ల వల్లో మాధ్యమాల వల్లో "అవును నిజమే ఇలాగ జరుగుతుంది" అని ఎవరైనా నిరూపిస్తే అప్పుడు ఒప్పుకుంటారా? మొదట్లో – గంగోత్రి దగ్గిర పుట్టిందోయ్ మీ గంగ ఇదేనా మీ పవిత్రమైన గంగ – అని వెక్కిరించిన పెద్దమనుషులే ఇప్పుడు కొత్తగా చెప్తున్నారు కదా? అందువల్లే దేనినీ పురాణం అని కొట్టిపారేయడం సరికాదు. గంగోత్రి దగ్గిరో మరోచోటో అలా జరిగి ఉండడానికి అవకాశం ఎందుకు లేదు? మొదట్లో ఏమనుకునేవారో తెలియదు కానీ ఇప్పుడు ఆకాశం లోంచి పడే నీళ్ళే అత్యంత శుద్ధమైనవి అని నిరూపించారు కదా? అందుకే అలా దివి నుండి దిగిన గంగ పవిత్రమైనది అని చెపుతున్నాయి మన పురాణాలు. సందర్భం వచ్చింది కనక ఈ కేదార్ నాథ్ గుడి గురించి మరో విషయం చెప్పుకుని ఈ వ్యాసం ముగిద్దాం.

పార్వతి శివుణ్ని అడిగిందిట ప్రపంచంలో ఇలా జనం పుడుతూ ఛస్తూ ఉన్నారు. మరి దీనికేమిటి తరుణోపాయం, అసలు ప్రాణి అనేది మృత్యువునీ, జనన మరణాలనీ తప్పించుకోవడం ఎలా అని. అది తెలుసుకోవాలంటే మనం యోగులం అవాలనేది స్పష్టం. అన్నీ వదులుకుని "ఆత్మార్థే పృథ్వీం త్యజేత్" అనుకున్న రోజునుంచి మనం ఆ దారిలో ఒక అడుగు ముందుకు వేసినట్టే. మరి ఇది ఎలా సాధ్యం? ఇంతకుముందు ఒకరెవరైనా అక్కడికి చేరినవారు "అవున్రా అబ్బాయ్ నేను సాధించాను నువ్వుకూడా సాధించవచ్చు, ఇలా సాధన చేయాలి, ఇదీ మార్గం" అని చెప్పినప్పుడు మనం ముందుకి సాగడం సులభం కదా? ఇటువంటి "ఒకరి"నే మనం గురువు అంటున్నాం. వీళ్ళలో కొంతమంది బ్రహ్మనిష్టులు. మరికొంతమంది బ్రహ్మ శ్రోత్రీయులు బ్రహ్మ శ్రోత్రీయులంటే బ్రహ్మం అంటే దాని గురించి విని ఉన్నవారు. బ్రహ్మ నిష్టులు సాధన చేసి స్వతహాగా బ్రహ్మాన్ని ఎరిగినవారు. స్వామి సత్యానంద సరస్వతి గారు చెప్పడం ప్రకారం మనం ఇద్దరినీ నమ్మవచ్చు. ఎందుకంటే బ్రహ్మశ్రోత్రీయులు మనకి తెలియని విషయం కనీసం విని ఉన్నారు. బ్రహ్మనిష్టులైతే సాక్షాత్తూ చూసి ఉన్నవారు.

ఈ బ్రహ్మనిష్ఠులలో ఆదియోగి శివుడు. మరి ఈ బ్రహ్మమనేది తెలుసుకోవాలంటే ఎలా? సాధన చేసి తీరవలసిందే. ఈ సాధనలో కొంత దూరం వెళ్లాక గురువు మరికొంత సహాయం చేస్తాడు. కానీ బ్రహ్మం అనేదాన్ని తీసుకొచ్చి ఆయన మనకి అరచేతిలో వైకుంఠం లాగా ఇదిగో అని చూపించడు. ఎందుకంటే బ్రహ్మం అనేది మనమే; మననుండి వేరు కాదు కాబట్టీ అది ఎవరికివారే తెలుసుకోగలది కాబట్టీను (అహం బ్రహ్మాస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, సర్వం ఖల్విదం బ్రహ్మ). దీనినే రమణులు చెప్పడం ప్రకారం పంచదార తీపి ఎలా ఉంటుందో తెలుసుకుందాం అనుకోవడం. తానే తీపి అయినప్పుడు తీపి ఎలా ఉంటుందో తెలుసుకోవడం ఏమిటి? అయితే గురువనేవాడు గుర్రాన్ని నీళ్లదాకా తీసుకెళ్లగలడు కానీ నీరు తాగవల్సింది మనమే. ఈ యోగ రహస్యాలు గురువు చెప్పాలంటే శిష్యుడు తయారుగా ఉండాలి. ఏ శిష్యుడికి తగ్గ విషయాలు వారికి చెప్పబడతాయి – వారివారి మనఃస్థితులని బట్టీ, ఎవరు ఎంత దూరంలో ఉన్నారనే విషయాన్ని బట్టి. ఒకరికి చెప్పినది మరొకరికి పనిచేయక పోవచ్చు.

అలా పార్వతి అడిగిన ప్రశ్నకి శివుడు సమాధానం చెప్పడానికి కేదార్ నాథ్ తీసుకెళ్ళాడుట. ఇక్కడ పార్వతి శిష్యుడు. శివుడు గురువు అని అర్థం చేసుకోవాలి తప్ప వాళ్ళిద్దరూ ఆడా, మొగా అనీ పెళ్ళైన దంపతులనీ మరో అర్థం తీయకూడదు. మరి శిష్యుడికి చెప్పేది మరో ప్రాణి వినకూడదు (పైన చెప్పినట్టూ ఒక శిష్యుడికి ఇచ్చే పాఠం మరొకరికి పనికిరాదు) కనక ఒక ఏకాంత ప్రదేశానికి (అమరనాథ్ గుహ) తీసుకెళ్ళాడు పార్వతిని. మరి శివుడు ఒంటరివాడు కాదు కదా? ఆయనికి కూడా మెడలో వాసుకీ, తలమీద చంద్రుడూ, కూడా గణపతీ, నందీ ఉన్నాయి. తీసుకెళ్ళేదారిలో ఒకచోట నందిని వదిలేసాడు. ఆ ప్రదేశం పేరు “పహల్గాం.” ఆ తర్వాత వదిలినది తలమీద చంద్రుడిని “చందన్ వాడీ” అనే చోట. తర్వాత విసర్జించినది కంఠంలో నాగేంద్రుడిని “శేష్ నాగ్” అనే చోట. కూడా ఉన్న గణేషుణ్ణి “మహాగుణాష్” అనే చోట ఉంచాక “పంచతరణి” అనేచోట పంచభూతాలని (పృథ్వి, నీరు, వాయువు, అగ్ని, ఆకాశం) విడిచిపెట్టాడుట శివుడు. అన్నీ విడిచిపెట్టడం అనేది గమనిస్తే మనకి అర్థమయ్యేది ఏమిటంటే, ఎప్పటిలాగానే చెపుతున్నట్టూ, ఆత్మార్థే పృథ్వీం త్యజేత్. ఇటువంటివన్నీ వదులుకున్నాక మనకి నిశ్చయంగా లభించేది ఏమిటంటే బ్రహ్మం. అరే, అసలీ బ్రహ్మ పదార్థం అనేది ఉందా, ఉంటే ముందు కళ్లకి ఎందుకు కనిపించదు అనే ప్రశ్నకి స్వామి సత్యానంద సరస్వతి గారు ఇచ్చే సమాధానం అద్భుతంగా ఉంటుంది చూడండి. “మహా సముద్రాల్లో హిమాలయాలకంటే ఎక్కువ ఎత్తున్న పర్వతాలు ఉన్నాయనీ అంతరిక్షంలో ఏదో చోట భూగ్రహంలాంటి గ్రహాలు తిరుగుతున్నాయనీ చెప్తున్నారు. మనం చూసామా? మరి అవి కంటికి కనబడటం లేదే? అంటే అవి లేవా? సుగంధం అనేది కంటికి కనిపిస్తోందా? మనసులో ఆలోచనలు కంటికి కనిపిస్తున్నాయా? మరి అలా కనిపించకపోతే అవి లేవనవచ్చా? సాధన చేస్తే భగవంతుడూ, బ్రహ్మమూ కనిపించి తీరుతాయని శివానందులూ, రమణులూ, శ్రీ రామకృష్ణుల వంటివారు చూపించారు కదా ప్రపంచానికి? ఏ ప్రయత్నం లేకుండా భగవంతుడు మనకి ఎందుకు కనిపించాలి? ఆఖరికి రోజువారీ చాకిరీ చేసే ఉద్యోగంలో కూడా పై అధికారి మెప్పు పొందాలన్నా ఏదో ఒక పని చేసి చూపించాలి కదా? మరి ప్రపంచం, భగవంతుడూ అనే పెద్ద సమస్యకి పరిష్కారం కావాలంటే ఎంత ప్రయత్నం చేయాలి? అన్నింటికన్నా హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే, మనం చిన్న, చిన్న విషయాల్లో కూడా ఎవరో చెప్పినది నమ్ముతాము కానీ ఇలా భగవంతుడి విషయం వచ్చేసరికి మనకి నమ్మడానికి అహం అడ్డం వస్తూ ఉంటుంది. ఎందుకంటే, లెక్కలు చేసేటప్పుడు మన ఉపాధ్యాయులు చెప్పినట్టు “మొత్తం ఒకటి అనుకో, అలా అనుకుంటే చివరిలో సమాధానం వచ్చేస్తుంది” అనేది సులభంగా నమ్ముతున్నాం కానీ భగవంతుడు ఏదో రూపంలో ఉన్నాడు అనుకుని చివరికి రూపరహితమైన బ్రహ్మన్ని తెలుసుకోవడానికి మనకి సమయం కానీ ఓపిక కానీ లేవు.” బాగుంది కదా?

అందువల్లే బ్రహ్మం ఉందా అనేదానికి సమాధానం బుద్ధుడు చెప్పినట్టూ ఎవరికి వారే తెలుసుకోదగ్గది. అది ఉందని రుజువు చేయొచ్చు ఓపిక ఉండి బ్రహ్మ నిష్ఠులైన గురువు చెప్పినట్టూ చేస్తే. అందులో నిమగ్నమవడం చివరి దశ. ఆ బ్రహ్మం అనేది మనలోనే ఎల్లవేళలా ఉన్నది, ప్రతీ అణువులోనూ ఉన్నదీను. దీనినే భాగవతంలో పోతన చెప్పిన పద్యంలో గమనించవచ్చు.

క. హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయముగాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన వింటే [2-17]

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(**కొనసాగింపు వచ్చే సంచికలో**)

COMMENTS